క్లుప్తంగా

వైభవంగా సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనాలు

సాలూరు: పట్టణంలోని పంచముఖేశ్వరిస్వామి ఆలయంలో సుమారు 85 మందికి ఆదివారం సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. సుబ్బగురువు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కార్యక్రమం జరిపించారు. మాఘ ఆదివారం సందర్భంగా ఉపనయనాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● సీఐ దేముడుబాబు



కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ దేముడుబాబు, తదితరులు

సాలూరు: శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ జి.దేముడుబాబు హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఇటీవల కొంతమంది వ్యక్తులు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను చించుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇటువంటి కార్యక్రమాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయని తెలిపారు. ఎవరైనా ఫ్లెక్సీలు చింపినా, పాడుచేసినా, ఆకారాలు మార్చినా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం యువతీ యువకులకు ఉపయోగపడే కెరీర్ గైడెన్స్ అవగాహన పత్రాలను ఆవిష్కరించారు.

చేపలు మృత్యువాత



మృత్యువాత పడిన చేపలు

మక్కువ: మండల కేంద్రంలోని బైరిసాగరంలో పెంచుతున్న చేపలు ఆదివారం మృత్యువాత పడ్డాయి. మక్కువకు చెందిన ఎం.ఆదినారాయణ బైరి సాగరం చెరువును లీజుకు తీసుకొని చేపలు పెంచుతున్నాడు. అయితే ఒక్కసారిగా రెండు టన్నుల చేపలు మృత్యువాత పడడంతో ఆదినారాయణ లబోదిబోమంటున్నాడు. గుర్తు తెలియని దుండగులు చెరువులో విషం కలిపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

లోక రక్షకుడు ఏసు



ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ఏసుక్రీస్తు లోకరక్షకుడని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని తాలాడలో జరిగిన క్రైస్తవ ఉజ్జీవ మహాసభలో పాల్గొని యేసుప్రభువు ఆశిస్సులు తీసుకున్నారు. మానవులకు బాధల నుంచి విముక్తి కలిగించేందుకు స్వస్థత చేకూర్చడానికి ఈ లోకానికి మానవరూపంలో వచ్చిన దేవుడు క్రీస్తు అని అన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు, క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈఈ మెరిట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ



రవిచంద్రకు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

రాజాం: రాష్ట్ర స్థాయి ఈఈ(ఎడ్యుకేషన్ ఎపిఫనీ) మెరిట్ టెస్ట్‌లో మండలంలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి గార రవిచంద్ర ప్రతిభ కనబరిచాడు. రెండు రోజుల క్రితం ఆన్‌లైన్ ద్వారా ఎన్‌జీవో నిర్వహించిన ఈ టెస్ట్‌లో సదరు విద్యార్థి జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థికి ఈ నెల 17వ తేదీన విజయవాడలో మాకినేని బసవపున్నయ్య కేంద్రం వద్ద స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, ఈఈఎంటీ జాయింట్ డైరెక్టర్ వి.ఎ.స.సుబ్బారావుతో పాటు కన్వీనర్ పి.ఎస్.ఆర్.సి.మూర్తిలు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లతో సన్మానించారు. ఈ మేరకు పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

శంబరకు పోటెత్తిన భక్తులు



శంబర పోలమాంబ



చదురు గుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చదురుగుడి, వనంగుడులలో కొలువైన పోలమాంబకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న వేపచెట్టుకు పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవదాయ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. మంగళవారం నిర్వహించే ఐదో జాతరకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ వీవీ సూర్యనారాయణ తెలిపారు.

అంటిపేట కాలనీలో సీసీ రోడ్డు పనులు



అంటిపేటకాలనీలో పనులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ సహాయకుడు నవీన్‌కుమార్

సీతానగరం: మండలంలోని అంటిపేటలో జీజీఎంపీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఇంజినీరింగ్ సహాయకుడు డి.నవీన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, సర్పంచ్ బి.తిరుపతిరావు, ఎంపీటీసీ నిర్మల, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, మాజీ సర్పంచ్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో అంటిపేట కాలనీల్లో ఇంతవరకూ ఇంటింటి కుళాయిలు, సీసీ రోడ్డు పనులు నిర్వహించామని చెప్పారు. తాజాగా అంటిపేట కాలనీలో జీజీఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే అంటిపేట జంక్షన్ నుంచి వెంకటాపురం మీదుగా వెన్నెలబుచ్చింపేట వరకూ బీటీరోడ్డు వేసేందుకు అవసరమైన పనులు జరుగుతున్నాయన్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థిని

జియ్యమ్మవలస: ఈ నెల 15న అదృశ్యమైన విద్యార్థినిని చినమేరంగి పోలీసులు పట్టుకుని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. చినమేరంగి కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఈనెల 15 నుంచి కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన పోలీసులు ఆ విద్యార్థిని ఉల్లిభద్ర గ్రామంలోని తన పిన్ని ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. శనివారం రాత్రి ఆమెను తీసుకువచ్చి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. చదువు ఇష్టంలేక పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు విద్యార్థిని తెలిపిందని ఎస్సై తెలిపారు.

అందుబాటులోకి గోదాంలు



లివిరిలో రూ.25 లక్షలతో నిర్మించిన మినీ గోదాం



భామినిలో రైతు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాం

భామిని: రైతు సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది. సాగు పెట్టుబడి కింద ఏటా రూ.13500లు విడతల వారీగా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. రైతులు పండించిన పంటలను ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తోంది. పంటకు గిట్టుబాటు ధర వచ్చేవరకు నిల్వ చేసుకునేందుకు వీలుగా మినీ గోదాంలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని లివిరి, బిల్లుమడ, భామినిలో గోదాంలు నిర్మించారు. బిల్లుమడ, లివిరిలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఒక్కొక్కటి రూ.25 లక్షల వ్యయంతో మినీ గోదాంలు నిర్మించారు. భామినిలో వెలుగు ఆధ్వర్యంలో, రైతు సమాఖ్య నేతృత్వంలో రూ.15 లక్షల వ్యయంతో మరో గోదాం నిర్మాణం చేపడుతున్నారు.

మోసాలపై అప్రమత్తం

పాలకొండ: పట్టణంలో జరుగుతున్న మోసాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సీఐ మీసాల చంద్రమౌళి సూచించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో బ్యాంకుల వద్ద తరచూ కొంతమంది మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రా చేసిన వారు అప్రమత్తంగా ఉండాలని, తోడుగా ఒకరిని బ్యాంకుకు వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వాహనాలు వేలం రేపు

భామిని: ఎస్ఈబీ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 20న పాలకొండ ఎస్ఈబీ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ప్రభుత్వ నిబంధనల మేరకు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

24 నుంచి తాడికొండ జాతర

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 24 నుంచి మండలంలోని తాడికొండ గ్రామంలో అర్థనారీశ్వరి మజ్జిగౌరీ దేవి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ

పాలకొండ రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు బిల్లుల మంజూరుకు ఎన్నికల కోడ్‌కు ఎటువంటి సంబంధం లేదని హౌసింగ్ ఏఈ మాధవరావు అన్నారు. పాలకొండ అర్బన్ కాలనీలో చేపడుతున్న గృహనిర్మాణాల పురోగతిని ఆదివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎటువంటి అపోహలు లేకుండా నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. కాలనీలో విద్యుదీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు వెంటనే బిల్లులు చెల్లించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ల మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

ఇంటి పేరుతో కుల నిర్ధారణ సాధ్యం కాదు



మాట్లాడుతున్న గిరిజన ఐక్యవేదిక సంఘ నాయకులు

భామిని: కుల నిర్ధారణకు ఇంటి పేరు కొలమానం కాదని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342లో పేర్కొన్న తెగలకు ఎస్టీ హోదా వస్తుందని గిరిజన ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పిరపక శ్రీనివాసరావు, జేఏసీ మండల నాయకులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కులంపై టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ చేసిన వ్యక్తలను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. విశ్వాసరాయి ఇంటిపేరు గిరిజనుల్లో లేదని అనడం జయకృష్ణ అజ్ఞానాన్ని బయటపెడుతోందన్నారు. మూడుసార్లు టీడీపీ తరఫున పోటీచేసి ఓటమి పాలవడం, భవిష్యత్ అగమ్యగోచరంగా మారడంతో జయకృష్ణ ఏం మాట్లాడుతున్నారో తనకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. చరిత్రపై కనీస అవగాహన లేకుండా గరిజన బిడ్డపై విమర్శలు చేయడం తగదన్నారు. గిరిజన ఐక్యవేదిక నాయకులు కోలక ధర్మారావు, మండంగి గజపతి, లక్ష్మీనారాయణ, కీర్తిరాయ సుగ్రీవులు తదితరులున్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

రామభద్రపురం: మండల కేంద్రం నుంచి బొబ్బిలి వెళ్లే రోడ్డులో ఉన్న చొక్కాపువాని చెరువు వద్ద ద్విచక్ర వాహనం, లారీ ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో కొండాల నూకరాజు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బొబ్బిలి రావువారి వీధికి చెందిన నూకరాజు మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో వంటపని చేస్తుంటాడు. శనివారం రాత్రి పని అయిన తర్వాత విశాఖపట్నం నుంచి వచ్చిన ఆయన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి వెళ్తుండగా, చెరువు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల సహకారంతో 108 అంబులెన్స్‌లో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందజేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సి.హెచ్.కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ పుస్తకాలు, కథలు చదివించడం, కథలు చెప్పించడం వంటివి చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా భాషపై మక్కువ పెరగడంతో పాటు మంచి, మంచి విషయాలు తెలుస్తాయన్నారు.

కట్టెజనుము సాగుపై ఆసక్తి

పాలకొండ రూరల్: భూసారం పెంచటంతో పాటు రైతుకు లాభం చేకూర్చే కట్టెజనుము పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రస్తుత తరుణంలో పచ్చిరొట్ట సాగులో భాగంగా కట్టెజనుము సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వ్యవసాయశాఖ ద్వారా ఆర్‌బీకేల్లో కట్టెజనుము విత్తనాలను రైతులకు ఉచితంగా అందించడంతో సాగు విస్తీర్ణం పెరిగింది.



పాలకొండ-వీరఘట్టం రహదారిలో సాగులో ఉన్న కట్టెజనుము

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం



పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు తెలిపారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లయితే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పలు మార్లు పట్టుబడినట్లయితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

జిల్లా ఆస్పత్రిలో ఈహెచ్ఎస్ సేవలు

● సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి



పార్వతీపురం టౌన్: జిల్లా ఆస్పత్రిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్) వైద్యసేవలు అందిస్తున్నామని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఔట్‌పేషెంట్ సేవలు అందిస్తామని తెలిపారు. డిస్పెన్సరీలో సేవలు అందిస్తున్నామని, ఇందులో కన్సల్టేషన్, డయాగ్నొస్టిక్స్, మందులు అందజేస్తామని, రిఫర్ సేవలకు పైస్థాయి ఆస్పత్రులకు పంపించనున్నట్లు తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ. 2 లక్షల విలువ వరకు ప్యాకేజీ అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈహెచ్ఎస్‌లో వైద్యం అందించే వైద్యుల వివరాలు సిద్ధమని పేర్కొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా భవనాలు, సీసీ రోడ్లు

● డీఈ రత్నకుమార్, ఏఈ చంద్రమౌళి



అంటిపేటలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ డీఈ రత్నకుమార్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వెంకటాపురం సచివాలయ భవనం

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం గ్రామాల్లో అధికారుల పాలన, గ్రామస్తుల మౌలిక సదుపాయాల నిమిత్తం మంజూరుచేసిన నిధులతో నిర్మించిన భవనాలు, సీసీ రోడ్లు, కాలువల పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని పీఆర్ డీఈ ఎం.రత్నకుమార్, ఏఈ చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని అంటిపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను, ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న సచివాలయం, ఆర్బీకే, వెల్ నెస్ సెంటర్ భవనాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సూరంపేట, పెదంకలాం గ్రామాల్లో సచివాలయం, ఆర్బీకే భవనం, వెంకటాపురం, పెదంకలాం పెదభోగిలి-1, పెదభోగిలి-2, సచివాలయం భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. అలాగే మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయడం వల్ల రూ.3 కోట్ల,47 లక్షల 7 వేలతో సీసీ రోడ్లు, కాలువలు, పైప్, శ్లాబ్ కల్వర్ట్‌ల నిర్మాణం చేపట్టడానికి అవసరమైన నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా సీసీ కాలువలు, సిమెంట్ రోడ్ల పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

22న కృష్ణ మాస్టారు విగ్రహావిష్కరణ



కృష్ణ మాస్టారు సేవలను కొనియాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు విగ్రహావిష్కరణ ఈ నెల 22వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం కలిసి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణ మాస్టారు గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన గొప్పవ్యక్తి కృష్ణ మాస్టారు అని, ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, డీసీసీబీ డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ బోను అప్పలనాయుడు, ఉద్దవోలు సర్పంచ్ ఎచ్చెర్ల సునీత విజయప్రసాద్ తదితరులు ఉన్నారు.

మోతాదు మించితే ముప్పే..

● రబీలో ఎరువుల వినియోగం తగ్గించాలి
● సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు



బత్తిలి వద్ద పొలం దమ్ము చేస్తున్న అన్నదాత



కాట్రగడ-బి వద్ద రబీ వరిసాగులో ఎరువులు వేస్తున్న రైతు

భామిని: ఖరీఫ్ పంట కోసిన రైతులు రబీలో రెండో పంటగా వరి సాగు చేస్తున్నారు. నీటివసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి నారుమడులు సిద్ధం చేశారు. వ్యవసాయ బోర్లు, సోలార్ పంపుసెట్లతో పొలాలకు నీరు పెట్టి దమ్ములు చేస్తున్నారు. రెండో పంటగా వరిసాగు చేస్తున్న రైతులు చీడపీడలు, కలుపు నివారణపై దృష్టిసారిస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ ఏఓ కిమిడి మన్మథరావు సూచిస్తున్నారు.

మోతాదుకు మించొద్దు..

రబీలో దమ్ముపొలంలో యూరియా, డీఏపీ వంటి వినియోగం తగ్గించాలి. ఖరీఫ్‌లో వేసుకున్న మోతాదుకు సగం మొత్తంలోనే వేసుకుంటే సరిపోతుంది. ఒక ఎకరం దమ్ము పొలంలో రెండు బస్తాల సూపర్ ఫాస్ఫేట్, అరబస్తా పొటాష్, అరబస్తా యూరియా కలిపి వేసుకోవాలి. వరినాట్లు వేసిన 25-30 రోజుల్లో పిలక దశలో రెండోదఫాగా అర బస్తా యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి వేసుకోవాలి. మూడోదఫాగా వరిచేను చిరుపొట్ట దశలో 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాల్సి ఉంటుంది. మోతాదుకు మించితే ఖర్చు పెరిగిపోవడంతో పాటు భూమి సారం కోల్పోయి చౌడుగా మారిపోయే ప్రమాదం ఉంది. ఎరువులు సమపాళ్లలో వేసుకుంటే గింజ సైజు, బరువు పెరుగుతుంది.

కలుపు నివారణ చర్యలు

వరినారు ముప్పై రోజుల్లోపు నాటుకోవాలి. నాటిన మూడో రోజు కలుపు నివారణ కోసం ఎకరానికి 35 గ్రాముల ఆక్సాడై యాజిల్ మందును 20 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి. చేనులో గడ్డిజాతి కలుపు మొక్కలు గుర్తిస్తే రేపఫ్‌గా పిలిచే కించర్ మందు పావులీటరును 9 ట్యాంకుల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వెడల్పు ఆకులు కలిగిన కలుపు మొక్కలు ఉంటే టూ-ఫోర్-డీ(2-4-డి) ఒక కిలో మందును రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండురకాల కలుపు మొక్కలు ఉంటే 80 గ్రాముల నామినీ గోల్డ్ మందును పది ట్యాంకుల నీటిలో కలిపి చల్లాలి. వరి చేనుకు 50 రోజులు దాటిన తరవాత కలుపు నివారణ మందులు వేయక్కరలేదు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

బొబ్బిలి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలో అడిషన్ల కోసం తిరుగాడుతు న్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును ఏఐఎస్ఎఫ్ సభ్యులు ఆదివారం అడ్డుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు సేకరిస్తున్నాయని, అలాంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

